తెలుగు కళాసమితి(న్యూజెర్సీ) ఉగాది మినీకథల పోటీలో రు. 150 గెలుపొందిన రచన

# మీ తరం కాదు

## కె. గోదావరిశర్మ

ప్రొఫెసర్ రావుగారు కళ్లు మూసుకొని దీర్ఘాలోచనలో నిమగ్నమై ఉన్నారు. ఆ ఆలోచన ఏదో అప్రియమైనది కాబోలు, ఆయన ముఖం బాధతో మ్లానమై ఉంది.

"సర్, పిలిచారట!" తలుపు దగ్గర నిలబడి వున్నాడు మహేశ్వర్, చూపుడు వేలితో కీ చైన్ గిరగిర తిప్పుతూ.

అతడి గొంతులో నిర్లక్ష్యం, తనకి గురువుగారైన ఒక విద్యానిధి ఎదుట అతడు నిలబడ్డ తీరూ అతడు విద్యకు దేవాలయమైన ఆ విశ్వవిద్యాలయంలో వుండ డానికి అనర్హుడని చెప్పక చెపుతున్నాయి. కాని డాక్టర్ మహేశ్వర్, ఎం.ఎస్‌సి., పిహెచ్.డి., ఆ విశ్వవిద్యాలయంలో, అదే శాఖలో లెక్చరరు. ప్రొఫెసర్‌గారు కొన్నేళ్ల క్రిందట తనకి గురువైనా, ప్రస్తుతం తను సహోద్యోగి కాబట్టి మరి ఆయనని గౌరవించక్కర్లేదని అతడి అభిప్రాయం. అదీ కాక, అతడి ధీమాకి ఇతర కారణాలూ ఉన్నాయి.

మహేశ్వర్ ఎం.ఎస్‌సి., పాస్ కావడం, రిసెర్చిలో ఫెలోషిప్ రావడం, మూడేళ్లు తిరక్కుండా డాక్టరేట్ రావడం, లెక్చరర్‌గా నియామకం- ఇవేవీ అతడి ప్రతిభని బట్టి జరిగినవి కావని యూనివర్శిటీలో అందరికీ తెలుసు. ప్రొఫెసర్ రావుగారికి మహేశ్వర్ అంటే వ్యక్తిగతమైన ద్వేషం ఏమీ లేదు. కాని ప్రతిభ కోసం తాపత్రయపడే వ్యక్తి కనక, మహేశ్వర్ ఆయా ఘట్టాలలో సాధించిన సునాయాస విజయాన్ని ఆయన హర్షించలేక పోయారు. ఆపనూ లేక పోయారు. మహేశ్వర్ మాత్రం ఆయన తన ప్రగతికి అడుగడుగునా అడ్డు తగులుతున్నాడని, అంచేత తనకి శత్రువనీ నమ్ముతున్నాడు.

"రా, కూర్చో" అన్నారు ప్రొఫెసర్ రావుగారు, నెమ్మదిగా. మహేశ్వర్ వచ్చి ఆయనకి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌కి నిన్ను రికమెండ్ చేశారటగా! కంగ్రాచ్యులేషన్స్!" అన్నారాయన, ప్రశాంతంగా.

"థాంక్యూ" అని గొణిగాడేగాని, ఆయన గొంతులో వ్యంగ్యం ఏమైనా ఉందా అని ఆలోచించాడు మహేశ్వర్. కాని సైన్సులో అఖండ మేధావి అయిన ప్రొఫెసర్‌రావుగారు వ్యంగ్యమూ వక్రోక్తి వంటి కావ్య సామగ్రి ఉపయోగించడంలో మాత్రం నిష్ణాతుడు కాదు. అయినా, పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది కదా!


జరిగిన దేమిటంటే, ఆ ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌కి ప్రొఫెసర్ రావుగారు అప్లై చేశారు. ఇక్కడి పూజార్లు ఆటంకపెట్టక పోతే ఆయన కా ఫెలోషిప్ సులభంగా వస్తుంది. కాని రాజకీయాలలో ఏమాత్రం ప్రవేశంలేని ఆయనకి ఆ గౌరవం అనవసరమని తలచిన వాళ్లు కొందరు, మహేశ్వర్ శ్రేయోభిలాషులు, అతడినీ అప్లై చెయ్యమని సలహా ఇచ్చారు. యువమేధావుల్ని ప్రోత్సహించే సదాశయంతో వైస్-ఛాన్సలర్‌గారు ప్రొఫెసరురావుగారి దరఖాస్తును వెనక్కి పెట్టి, మహేశ్వర్ దరఖాస్తును రికమెండ్ చేసి పంపించారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు.

ఈ సంగతి ఇంతవరకు ప్రొఫెసర్ రావు గారికి తెలియ దనుకున్నాడు మహేశ్వర్. నిజానికి అతడి అప్లికేషన్ ప్రొఫెసర్ రావుగారే ఆ శాఖాధిపతిగా ఫర్‌వార్డ్ చెయ్యాలి. ఆయన చేసి వుండేవాడే. కాని ఎందుకైనా మంచిదని, ఆయన ఒక రోజు సెలవులో వున్న సమయం చూసి ఇన్-ఛార్జి హెడ్ చేత సంతకం పెట్టించి అప్లికేషన్ పంపించేశాడు మహేశ్వర్. తరవాత కూడా తను ఆ ఫెలోషిప్‌కి అప్లై చేసినట్టు ప్రొఫెసర్ గారికి చెప్పలేదు. అయినా పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగితే లోకం చూడలేదా? ఆ మర్నాడే ఇన్-ఛార్జి హెడ్ ఆయనతో ఆ విషయం చెప్పాడు. తరవాత జరిగినది ఇది.

ఇప్పుడు ప్రొఫెసరుగారు పిలిచి స్వయంగా అభినందించగా, తేలుకుట్టిన దొంగలా మౌనంగా వుండిపోయాడు గాని, ఎక్కువసేపు అలా వుండలేక పోయాడు. "ఆ రోజు- నేను అప్లై చేసినప్పుడు మీరు సెలవులో వున్నారు సార్" అన్నాడు. సంజాయిషీ ఇస్తున్నట్టు.

"సరే, దాని కేముందిలే! అప్లై చెయ్యడం మంచిదే. ఇంకా కుర్రాడివి, వృద్ధిలోకి రావలసిన వాడివి. ఈ వయసులోనే ఫారిన్ వెళ్లి రావాలి..." ఇలా అని, ఎదురుగా గోడమీద ఐన్‌స్టీన్ ఫొటో కేసి చూస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయారు ప్రొఫెసర్ రావుగారు.

కొంచెంసేపు చూసి, ఇక కూర్చోవడం ఇబ్బందిగా తోచి, సెలవు పుచ్చుకుందా మనుకున్నాడు మహేశ్వర్. కాని ప్రొఫెసర్‌గారు హఠాత్తుగా మొదలెట్టేరు, పెదవుల మీద అదో రకమైన చిరునవ్వుతో. "దాదాపు ఇరవై సంవత్సరాల క్రిందట ఇదే డిపార్ట్‌మెంట్‌లో జరిగిన సంఘటన చెపుతాను




విజయనగరం జిల్లా నెల్లిమర్లలో చైతన్యకళాభారతి ఆధ్వర్యాన ఇటీవల జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్య వక్త డాక్టర్ ఎ. గోపాలరావు, అధ్యక్షులు శ్రీ చాగంటి సోమయాజులు, సంస్థ అధ్యక్షులు శ్రీ జి.జి. కృష్ణమూర్తి


వను. నే నప్పటికి ఇంకా రిసెర్చిస్కాలరుగా వున్నాను, ప్రొఫెసర్ వినయ్ ముఖర్జీగారి దగ్గర. ఆయనా అప్పటికి యువకుడే. నలభై కూడా వుండవు. కాని సబ్జెక్టులో మంచి దిట్ట. నేను అహోరాత్రాలు శ్రమించి హైపోథసిస్ తయారు చేసి ఆయనకి చూపించాను. ఆయన అది చదివిఉప్పొంగి పోయారు. నా ఊహల్ని, ఆలోచనల్ని ఎంతో మెచ్చుకున్నారు. అప్పటి నుండి నేను పరిశోధనలు చేసి నా థీసిస్‌ని ప్రయోగాత్మకంగా నిరూపించే వరకు ఆయనా నాతో కలిసి పని చేసి నా కెంతో సహకరించారు. అది పూర్తయ్యాక, నాకు డాక్టరేట్ వచ్చాక, నాకు 'యంగ్ సైంటిస్ట్' అవార్డు వచ్చింది. అది వచ్చిన చాలా కాలానికి గాని నాకు తెలియ లేదు– ఆ రోజులలో ఆయనే ఆ యంగ్ సైంటిస్ట్ అవార్డుకి ప్రయత్నిస్తున్నారని, నేను నా సిద్ధాంతాన్ని చూపించే సరికి తన కన్న ఎక్కువగా నాకు ఆ అవార్డు రావాలన్న కోరికతో తన ప్రయత్నాలు విరమించి నా కృషి పూర్తయ్యే దాకా నాతో బాటు ఆయనా శ్రమించారనీ! తెలిశాక సిగ్గుపడి వెంటనే ఆయన దగ్గరకి వెళ్లి క్షమించమని వేడుకున్నాను. అప్పుడాయన ఏ మన్నారో తెలుసా? నా కిప్పటికీ గుర్తున్నాయి ఆ మాటలు. 'చూడు రావ్, ఎవరి దారికి ఎవరూ అడ్డురావడం అంటూ వుండదు. ఎవరి ప్రతిభ వారిది. ఎవరి కృషి వారిది. నీకు అర్హత వుంది. అవార్డు వచ్చింది. దానికి నేను ఏ మాత్ర మైనా కారణభూతుణ్ణయానంటే అది నాకు సంతోషమే ' అన్నారు. 'కాని తన్ను మాలిన ధర్మం ఎక్కడైనా ఉంటుందా సార్? పెద్దవారు, మీరు మానేసి నాకా గౌరవాన్ని ఇప్పించడం... ఎందుకో నేను దోషిలా ఫీలవుతున్నాను సార్...' అన్నాను.' ఆయన నవ్వి, 'దీనిలో నీ తప్పేం వుంది? నాకో నీకో ఎవరికో ఒకరికే అవకాశం వుంది ఈ సంవత్సరం! నాకు అవార్డు రావడం కంటే నీకు రావడమే నాకు ఎక్కువ ఆనందాన్నిస్తుంది. 'పుత్రా దిచ్ఛేత్ పరాజయం' అన్న మాట వినలేదూ నువ్వు? శిష్యులు కూడా పుత్రులే. జ్ఞానపుత్రులు అన్నారాయన. నేను కన్నీళ్లతో ఆయన పాదాలకు నమస్కరించాను..." చెపుతున్న రావుగారి గొంతు ఉద్వేగంతో కంపించింది. మహేశ్వర్ తల వంచుకున్నాడు.

"అప్పటికీ నేను ఊరుకోలేకపోయాను. 'నా వల్ల మీకు రావలసిన గౌరవం పోయింది. నేనేం చేసి మీ ఋణం తీర్చుకోగలను?' అన్నాను. ఆయన నవ్వి ఏమన్నారో తెలుసా? 'నువ్వు నీ శిష్యులకి ఇలాంటి ప్రోత్సాహమే ఇయ్యి. అదే నువ్వు నాకిచ్చే గురు దక్షిణ' అన్నారు తేలిగ్గా నవ్వుతూ..." ప్రొఫెసర్ రావుగారు దీర్ఘంగా నిశ్వసించారు. "ఆ రోజులే వేరు... ఆయన ప్రస్తుతం లేరు. ఆయన కోరిన విధంగా నేను ఇంతవరకు ఆయన ఋణం తీర్చు కోలేక పోయాను. ఇప్పుడొక అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది..." అన్నారు.

మహేశ్వర్ అర్థం కానట్టు చూశాడు.




"మరేం లేదు. నీకు ఈ ఫుల్‌బ్రైట్ ఫెలో షిప్‌కి అప్లై చేసే ఉద్దేశ్యం వున్నట్టు చెపితే నేను సంతోషంగా ప్రోత్సహించే వాడిని. నేనూ దానికి దరఖాస్తు పెట్టిన సంగతి నీకు తెలిసే వుంటుంది..




దానిని ఉపసంహరించుకుని వుండేవాడిని. అయితే ఇప్పుడు నాది కాక నీ అప్లికేషనే పంపించానుకో! అయినా, నాకూ సంతృప్తిగా వుండేది...'' అన్నారు ప్రొఫెసర్ రావుగారు.

మహేశ్వర్ ఆయన వైపు అనుమానంగా చూశాడు తనని వ్యంగ్యంగా విమర్శించడానికి, ఇలా అవమానించడానికే తనని పిలిపించాడని పించింది అతడికి. తనని పరిహసించడానికే ఎప్పటివో కథలు చెప్పి వాటితో తను చేసిన దానిని సరిపోల్చుతున్నాడనిపించింది. దానితో కోపమూ వచ్చింది. దానికి సహజమైన ఆవేశమూ తోడైంది. అంచేత తనని తాను సమర్థించుకుంటూ, ''మీరు చెప్పేవి సత్యకాలపు కథలు సర్! దిసీజ్ ఎ కాంపిటిటివ్ వరల్డ్! ఎవరికి అవకాశం వస్తే వాళ్లు అందిపుచ్చుకోవాలి. సెంటిమెంట్లు, ఆదర్శాలు అని పట్టుకు వేలాడితే బాగుపడం. ఏం చేస్తాం? లోకం అంతా అలాగే వుంది. పని జరగడం ప్రధానంగాని, అది ఎలా జరిగిందని చూడకూడదు. కాలంతో బాటు మనమూ మారాలి. మీరు ఎప్పుడో మీ ప్రొఫెసరుకి విధేయంగా వున్నారంటే ఆ రోజులు వేరు. ఇది మీ తరం కాదు. మీకు నచ్చినట్టు ఏమీ జరగవిప్పుడు. సారీ!'' అన్నాడు ధుమధుమలాడుతూ.

ప్రొఫెసర్ రావుగారు ఏమీ మాట్లాడకుండా అతడివైపే చూస్తూ ఉండిపోయారు.

ఇబ్బందిగా కుర్చీలో కదిలి, ''వస్తాను, సర్'' అన్నాడు మహేశ్వర్, లేస్తూ.

ప్రొఫెసర్‌గారు విషాదంగా నవ్వి ''నువ్వు అన్నది నిజం. ఇది మాతరంకాదు. ఇలా ప్రవర్తించడమూ మా తరం కాదు...'' అన్నారు.

వినిపించుకోనట్టు బయటకి వెళ్లిపోయాడు మహేశ్వర్. ●

